క్లుప్తంగా

ఏపీఈఆర్‌సీ చైర్మన్‌ను కలిసిన కలెక్టర్



స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు మొక్కను అందజేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు న్యూసిటీ: రాష్ట్ర విద్యుత్ సమన్వయ ఫోరం సమావేశానికి విచ్చేసిన ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌ను జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నగర శివారు దిన్నెదేవరపాడు గ్రామ సమీపంలోని ఏపీఈఆర్ కార్యాలయంలో చైర్మన్, సెక్రెటరీని కలిసిన కలెక్టర్ మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు.

10న సీతారాముల కల్యాణోత్సవం

కర్నూలు కల్చరల్: కర్నూలు ఓల్డ్‌సిటీ వన్‌టౌన్‌లోని పేట శ్రీరామాలయ శతాబ్ది బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నవంబర్ 10వ తేదీ ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం, ఉసిరిక పూజ, ఊంజల్ సేవ కార్యక్రమాలు జరుగుతాయని రామాలయ శతాబ్ది బ్రహ్మోత్సవ సమితి ప్రతినిధులు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే భక్తి సంగీత కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

9, 10 తేదీల్లో హేతువాద సంఘం మహాసభలు

కర్నూలు కల్చరల్: ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర మహాసభలు నవంబర్ 9, 10 తేదీల్లో ఒంగోలులో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేవీ కృష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన సమావేశంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే జయన్న, కార్యవర్గసభ్యులు డాక్టర్ రామగోపాల్, సీవీ వర్మ, నాగభూషణం, రామశేషయ్య, మల్లికార్జున, గాంధీ, సలీంబాషా, అజీజ్ తదితరులు పోస్టర్ల ఆవిష్కరణలో పాల్గొన్నారు.

అయోడిన్ లోపంతో థైరాయిడ్ వ్యాధి

ఓర్వకల్లు: అయోడిన్ లోపంతో థైరాయిడ్ వ్యాధి సంక్రమిస్తుందని రాష్ట్రీయ బాల్య స్వాస్థ్య జిల్లా అధికారిణి హేమలత అన్నారు. సోమవారం మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ.. అయోడిన్ లోపం వల్ల చిన్నారులలో ఎదుగుదల లోపించడం, బుద్ధి మాంద్యం, పెద్దల్లో థైరాయిడ్ సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ.. మనుషుల శారీరక పెరుగుదలకు, అభివృద్ధి, మానసిక వృద్ధి, గర్భస్థ పిండం, చిన్న పిల్లల్లో మెదడు ఎదుగుదలకు, తెలివితేటలకు అయోడిన్ దోహదపడుతుందని వివరించారు. గర్భవతులు తీసుకునే ఆహారంలో అయోడిన్ లేకపోతే మందబుద్ధి, వినికిడి లోపం, మూగతనం వంటి సమస్యలతో పిల్లలు పుట్టవచ్చని చెప్పారు. కొన్ని సార్లు గర్భస్రావం కలిగే ప్రమాదం ఉంటుందన్నారు. గర్భిణులు, చిన్న పిల్లలు అయోడిన్ కలిగిన ఉప్పునే వాడాలన్నారు. ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. అయోడిన్ కల్గిన ఉప్పుకు త్వరగా ఆవిరయ్యే గుణం ఉంటుందన్నారు. ఎండ వేడిమి, గాలి తగలకుండా మూత ఉన్న డబ్బాలో నిల్వ చేయాలని సూచించారు. డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఎం ప్రాణేష్‌కుమార్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



అంధ విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందిస్తున్న కలెక్టర్

కర్నూలు(అర్బన్): దివ్యాంగులు తమకున్న శక్తి సామర్థ్యాలతో సాంకేతికతను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా అన్నారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పలువురు దివ్యాంగులకు స్థానిక కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్మార్ట్ టచ్ ఫోన్లు, ల్యాప్‌టాప్స్ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల అవసరాలకు అనుగుణంగా ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు జీ మోహన్, ఎం వేణు, ఎం చందుకు స్మార్ట్ టచ్ ఫోన్లు, డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న అంధురాలు రేవతికి ల్యాప్‌టాప్ అందించడం జరిగిందన్నారు. వీరితో పాటు ఇంకా అవసరాలు ఉన్న వారికి దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవసరమైన వస్తువులను అందించడం జరుగుతుందన్నారు. వీటిని వినియోగించుకొని ఇంకా ఉన్నతమైన విద్యను అభ్యసించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డా.బీ నవ్య, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ రయిస్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్లపై కొరడా

- బినామీ ఉద్యోగులపై ఆరా
- డ్యూటీకి డుమ్మా కొట్టే వారి గుర్తింపు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం పరిధిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వాటర్ వర్క్స్ పరిధిలో, వీధి దీపాలు, పార్కు నిర్వహణలో పనిచేస్తున్న పలువురు వర్క్ ఇన్‌స్పెక్టర్లపై తగిన చర్యలు తీసుకునేందుకు జాబితా సిద్ధమైంది. రెగ్యులర్‌గా ముగ్గురు, అప్ కాస్ కింద 26 మంది పనిచేస్తున్నారు. వీరిలో 50 శాతం మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు పైరవీలు చేస్తున్నారు. డ్యూటీలకు రావడం లేదు. బినామీ ఉద్యోగులను నియమించుకున్నారు. కాంట్రాక్టర్లుగా, రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా, ఫైనాన్స్ వ్యాపారులుగా సొంత వ్యవహారాలు చూసుకుంటున్నారు. బదిలీ కాకుండా ఇక్కడే తిష్ట వేసిన ఓ అధికారిని ప్రసన్నం చేసుకుంటూ వీరంతా పనిచేయడం లేదు. అనారోగ్య కారణాలతో సిఫార్సు లేఖలతో ఇక్కడే కొనసాగుతున్న సదరు అధికారికి వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఇంటి సరుకులు, వంట సరకులు, ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా సొమ్ము ఇచ్చుకుంటూ పబ్బం గడుపుతున్నారు. పనిచేయకుండా, నగరపాలక సంస్థకు రాకుండా ఎంత మంది ఉన్నారు. సంతకాలు ఎంత మంది చేస్తున్నారు. పైరవీకారులు, అసలు ఆఫీసుకు రాకుండా ఎంత మంది ఉన్నారన్న అంతర్గత విచారణ ఇప్పటికే పూర్తయ్యింది.

పద్ధతి మార్చుకోండి.. లేకుంటే వేటు తప్పదు

నగర పాలకలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా ఉంటూ డ్యూటీకి డుమ్మా కొడితే కుదరదని సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజశేఖర్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక నగరపాలక వాటర్ వర్క్స్‌లో ఇంజినీరింగ్ విభాగం అధికారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనుల ప్రగతి, పెండింగ్ పనులు తదితర వాటిపై ఆరా తీశారు. ఇప్పటికే చాలా మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు తమ పద్ధతి మార్చుకోలేదని, త్వరలోనే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పని చేయండి. పైరవీలు చేస్తే వేటు తప్పదని సూచించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.



నగరపాలక సంస్థ కార్యాలయం

25న ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

కర్నూలు (టౌన్): స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు ఈ నెల 25న నిర్వహించనున్నట్లు ఆ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న ఉదయం 10 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో యోగాసన, చెస్ పోటీలు ఉంటాయని వెల్లడించారు.

24న పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది వేడుకలు

కర్నూలు(సెంట్రల్): పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను అక్టోబర్ 24వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పీడీఎస్‌యూ 50 ఏళ్ల ఉత్సవానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టరేట్‌లోని మీడియా పాయింట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం 50 ఏళ్లుగా పీడీఎస్‌యూ పోరాటాలు చేస్తూనే ఉందన్నారు. ఇది చారిత్రాత్మక ఘటన అని, 24వ తేదీన హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 5న విజయవాడలో అర్ధ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు జునిత్ బాష,రమణ, మల్లికార్జున, మునిస్వామి పాల్గొన్నారు.

సమస్యలపై అర్జీల వెల్లువ

కర్నూలు (టౌన్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో అదనపు కమిషనర్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగర వాసులు తమ కాలనీ సమస్యలను అర్జీల ద్వారా అదనపు కమిషనర్‌కు అందజేశారు. మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, రెవెన్యూ అధికారి జునీద్, ఎంఈ సత్యనారయణ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని

- 19వ వార్డు జొహరాపురంలో పార్కు స్థలం అన్యాక్రాంతం కాకుండాచూడాలని బీజేపీ కార్యవర్గ సభ్యులు రాంమోహన్ రెడ్డి విన్నవించారు.
- సచివాలయ ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న విన్నవించారు.
- శాంతి నగర్‌లో మురుగు కాల్వలు, రహదారులు నిర్మించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుల్లారెడ్డి వినతిపత్రం అందజేశారు.
- నాలుగవ తరగతి ఉద్యోగుల కాలనీ గణేష్ నగర్‌లో అడుగడుగునా ఉన్న స్పీడ్ బ్రేకర్లు తొలగించాలని స్థానికులు దస్తగిరి ఫిర్యాదు చేశారు.
- శ్రీవారి సుదర్శనం కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికలు విన్నవించారు.
- బళ్లారి చౌరస్తా సమీపంలోని హనుమాన్ కట్ట, రాజీవ్ నగర్ ప్రాంతాల్లో రహదారులు, వీధి దీపాల మరమ్మతులు చేపట్టాలని న్యాయవాది గండ్ల రాజేష్ ఫిర్యాదు చేశారు.
- 105వ సచివాలయం పరిధిలోని విజయలక్ష్మీ నగర్‌లో రహదారులు నిర్మించాలని స్థానికులు వరలక్ష్మీ, రాజేష్, ప్రవీణ్ వినతిపత్రం అందజేశారు.



అదనపు కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి

లైంగిక వేధింపులపై ఫిర్యాదు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మెడికల్ కళాశాలలో పనిచేసే తనకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ మహిళా సెక్యూరిటీ గార్డు వి.పద్మావతి లోకాయుక్తను ఆశ్రయించింది. ఈ మేరకు సోమవారం ఆమె లోకాయుక్తలో ఫిర్యాదు చేసింది. సెక్యూరిటీ ఏజెన్సీకి సంబంధించి సూపర్‌వైజర్లుగా పనిచేసే రవితేజ, ఫిరోజ్‌లు తనన లైంగికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని, హాస్పిటల్ సూపరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాళ్లకు ఫిర్యాదు చేసిన ఎవరూ పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రైతులకు రూ.20 వేలు పెట్టుబడిసాయం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏపీ రైతు సంఘం నాయకులు డీఆర్వో చిరంజీవిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెట్టుబడి సాయంగా ఇస్తామన్న రూ.20 వేల నగదును ఖరీఫ్ సీజన్ ముగిసినా ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రబీ సీజన్ ప్రారంభమైనా పెట్టుబడి నిధిపై నోరు మెదకపోవడం దారుణమని వాపోయారు. రబీ రైతులకు బీమా మొత్తాన్ని కూడా టీడీపీ కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టిందన్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఎకరాకు రూ.25 వేలను నష్టపరిహారంగా ఇవ్వాలని కోరారు. ధరలు పడిపోయిన పత్తి, ఉల్లి, కొర్ర రైతులను ఆదుకోవాలని కోరారు. నాయకులు రాయకృష్ణారెడ్డి, డి.శ్రీనివాస రావు పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఓపీ నిర్వహణ పర్యవేక్షించిన అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీల నిర్వహణను ఆసుపత్రి ఓపీ పర్యవేక్షణ కమిటీ అధికారులు సోమవారం పరిశీలించారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, ఈఎన్‌టీ తదితర విభాగాలను కమిటీ సభ్యులైన సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, యురాలజీ హెచ్‌వోడీ డాక్టర్ సీతారామయ్య, సైకియాట్రి హెచ్‌వోడీ డాక్టర్ నాగేశ్వరరావు పర్యవేక్షించారు. ఆయా విభాగాల్లో విధి నిర్వహణలో ఆ రోజు ఉండాల్సిన ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీలు ఉన్నారా లేదా అని పరిశీలించారు. ఒకరిద్దరు మినహా అందరూ ఉన్నారని గమనించారు. వారు కూడా ఒకరు యుజీలకు పరీక్షల నిర్వహణలో, మరొకరు కలెక్టరేట్‌కు పనిమీద వెళ్లినట్లు తెలుసుకున్నారు. గత శనివారం కూడా ఓపీలను పర్యవేక్షించామని, అందరూ ఉన్నారని, ఇకపై ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి. వెంకటేశ్వరరావు తెలిపారు.



గైనిక్ విభాగాన్ని పరిశీలిస్తున్న ఓపీ పర్యవేక్షణ కమిటీ సభ్యులు

ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎంఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆయాలు

కర్నూలు (రూరల్): పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు కోరారు. పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఆయాల రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా సోమవారం కర్నూలు అర్బన్ మండల ఆయాల నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 1600 మంది ఆయాలు గత ఆరు సంవత్సరాలుగా పనిచేస్తున్నారని కూటమి ప్రభుత్వం వారిని వేధిస్తూ, కొన్ని చోట్ల తొలగింపులు చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే ఐదు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. ఆయాల యూనియన్ జిల్లా నాయకురాలు ఉరుకుందమ్మ మాట్లాడుతూ.. ఆయాలకు జాబ్ చార్టు ఏర్పాటు చేయాలని కోరారు. రూ.12 వేలు వేతనం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్లతో నవంబర్ 25న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న దీక్షలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆయాలు పాల్గొన్నారు.

మాజీ సైనికుడి మృతి

కర్నూలు(అర్బన్): నగరంలోని అమ్మ హాస్పిటల్ సమీపం మహావీర్ కాలనీలో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు బాలకోటిరెడ్డి (75) సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నన్రా పేరయ్య తెలిపారు. ఆయన 15 మద్రాస్ రెజిమెంట్‌లో 22 సంవత్సరాలు నాయక్‌గా విధులు నిర్వహించారన్నారు. బాలకోటిరెడ్డి కుటుంబాలనికి సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఓర్వకల్లు: స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ శేఖర్ సోమవారం తెలిపారు. ఇటీవల కర్నూలు ఔట్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడాంశాలలో పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు చెప్పారు. రెజ్లింగ్‌లో జితేంద్రనాయుడు, హరికృష్ణ, హ్యాండ్ బాల్‌లో జీవన్, కబడ్డీలో కిరణ్, క్రికెట్‌లో సందీప్, త్రోబాల్‌లో మహిత రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. ఎంపికై న క్రీడాకారులను ప్రిన్సిపాల్ జోషలా వాట్, ఉపాధ్యాయులు అభినందించారు. అదేవిధంగా ఆయా క్రీడాంశాలలో విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన ఫిజికల్ డైరెక్టర్ శేఖర్‌ను ప్రశంసించారు.

నాలుగు రోజుల్లో రూ.94.53 లక్షల పన్ను వసూళ్లు

కర్నూలు (టౌన్): నగర పాలక రెవెన్యూ విభాగం ఈ నెల 17 నుంచి చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో పన్నుల రూపేణ రూ.94.53 లక్షలు వసూలైంది. పన్ను వసూళ్లలో గణనీయ వృద్ధి సాధించిన సిబ్బందిని సోమవారం నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు అభినందించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి పాటుపడాలన్నారు. నాలుగు రోజుల వ్యవధిలో ఆస్తి పన్ను రూ.89.25 లక్షలు, నీటి పన్ను రూ.5.28 లక్షలు వసూలు చేశారన్నారు. ఇప్పటివరకు పన్నులు చెల్లించని వారు cdma.ap.gov.in.వెబ్ సైట్‌ను సందర్శించి చెల్లించవచ్చని, అలాగే సచివాలయాల్లోనూ పన్నులను చెల్లించ వచ్చన్నారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, రెవెన్యూ ఆఫీసర్లు ఇశ్రాయేలు, జునీద్, ఆర్‌ఐలు శేషాద్రి, రాజు, తిప్పన్న, భార్గవ్, నాగరాజు ఉన్నారు.



రెవెన్యూ సిబ్బందిని అభినందిస్తున్న కమిషనర్

రూ.10 నాణేలను నిర్భయంగా వినియోగించవచ్చు

కర్నూలు(అగ్రికల్చర్): రూ.10 నాణేలు చట్టబద్ధమైనవని, రోజువారి లావాదేవీలకు నిర్భయంగా వినియోగించవచ్చని బ్యాంకు ఆఫ్ బరోడా కర్నూలు శాఖ చీఫ్ మేనేజర్ సుబ్బరాయుడు తెలిపారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు బీఓబీ రూ.10 నాణేల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆయన పేర్కొన్నారు. సోమవారం రాజ్‌విహార్ సమీపంలోని బ్యాంకు ఆఫ్ బరోడా కరెన్సీ చెస్ట్‌లో జరిగిన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా వివిధ దుకాణాల నిర్వాహకులు 45 మంది రూ.5 వేల మొత్తానికి సరిపడా రూ.10 నాణేలు అందచేశారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ మాట్లాడుతూ.. ఈ నాణేలను వ్యాపార, వాణిజ్యాలకు, దైనందిన జీవితంలో ప్రతి ఖర్చుకు వినియోగించవచ్చన్నారు. వీటిని అన్ని దుకాణాలు, బ్యాంకులు ఆమోదిస్తాయని పేర్కొన్నారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా బ్యాంకులను సంప్రదించవచ్చని సూచించారు. కరెన్సీ చెస్ట్ సీనియర్ మేనేజర్ హంపయ్య సిబ్బంది పాల్గొన్నారు.



రూ.10 నాణేలను పంపిణీ చేస్తున్న బీఓబీ చీఫ్ మేనేజర్ సుబ్బరాయుడు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కల్లూరు: అర్బన్ 29వ వార్డు పరిధిలోని పందిపాడు గ్రామంలో కంసలి వీధికి చెందిన ఉగ్గన్న వ్యాపారం కోసం శ్రీశైలం నుంచి వస్తుండగా ఘాట్ సెక్షన్‌లో ప్రమాదవశాత్తు మరణించాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సహాయంను సోమవారం అందజేశారు. కార్పొరేటర్ నారాయణరెడ్డి, నాయకులు భీమేశ్వరరెడ్డి, శివశంకర్‌రెడ్డి, తిరుమలేష్ గౌడ్, చిన్న సుంకన్న, బాలు, శేషు తదితరులు ఉన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల హామీలో భాగంగా కూటమి నేతలు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. సోమవారం సోమిశెట్టి నగర్‌లోని యూటీఎఫ్ కార్యాలయంలో 19, 20 వార్డుల మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడతూ.. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నా కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. నూనె, బియ్యం ధరలు ఆకాశంలో ఉన్నాయన్నారు. మరోవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. నాయకులు కేవీ నారాయణ, అరుణ, ఆర్.నరసింహులు, బి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

స్వీపర్లకు పెండింగ్ జీతాలు చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట స్కూలు స్వీపర్ల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.సుంకమ్మ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వీపర్ల జీతాలను కూడా పెండింగ్‌లో పెట్టడం అన్యాయమన్నారు. తక్కువ జీతంతో ఎక్కువ పని చేస్తున్న స్వీపర్లపై జాలి లేకుండా జీతాలు ఇవ్వకపోవడం ప్రభుత్వానికి మంచిపద్ధతి కాదన్నారు. అలాగే రాజకీయ జోక్యంతో తొలగిస్తున్న స్వీపర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పత్తికొండ నియోజకవర్గంలోనే 30 నుంచి 40 మంది స్వీపర్లను తొలగించారని, అధికారులు రాజకీయ పార్టీలకు తొత్తుగా మారడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, పత్తికొండ నియోజకవర్గ కార్యదర్శి రంగన్న పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న స్వీపర్లు

ఇతర విధుల్లో నాల్గవ తరగతి ఉద్యోగులు



రోగిని సహాయకులే స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో విధుల్లో ఉండాల్సిన వివిధ కేటగిరీల నాల్గవ తరగతి ఉద్యోగులు ఇతర విధుల్లో బిజీగా ఉన్నారు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా వార్డుబాయ్‌లు, స్ట్రెచ్చర్ బాయ్ తదితర పనులను రోగుల సహాయకులే చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆసుపత్రిలో 1956 నాటి పరిస్థితులకు అనుగుణంగా 114 నాల్గవ తరగతి ఉద్యోగుల పోస్టులు మంజూరయ్యాయి. అప్పటి నుంచి ఈ పోస్టులను ఏ ప్రభుత్వమూ పెంచలేదు. అందులోనూ ప్రస్తుతం రిటైరైన ఉద్యోగులు పోనూ 58 మంది మాత్రమే పనిచేస్తున్నారు. వీరిలో కూడా ఇతర పనుల్లో బిజీగా 30 మంది ఉన్నారు. కేవలం 28 మంది మాత్రమే వార్డుబాయ్‌లుగా పనిచేస్తున్నారు. ఇతర విధుల్లో భాగంగా ఆరుగురు ఎఫ్ఎన్ఓలు నర్సింగ్ హాస్టల్‌లో, ఇద్దరు ఎఫ్ఎన్ఓలు ఆఫీస్ సబార్డినేట్‌లుగా, ఒక ఎంఎన్ఓ 24 గంటల ల్యాబొరేటరీలో, ఒక స్ట్రెచ్చర్ బాయ్ క్యాష్ కౌంటర్‌లో, ఇద్దరు ఎంఎన్ఓలు స్టోర్‌లో, ఒక ఎంఎన్ఓ వాటర్‌మ్యాన్‌గా, ఎంఎన్ఓ లిఫ్ట్‌బాయ్‌గా, బ్లడ్‌బ్యాంకులో, ఆఫీస్ అటెండర్‌గా, స్ట్రెచ్చర్ బేరర్ స్టోర్‌లో, టేబుల్ బాయ్ అటెండర్‌గా ఒక్కొక్కరు, ముగ్గురు వాచ్‌మన్లు నర్సింగ్ హాస్టల్‌లో, ఒక వాచ్‌మన్ వాటర్‌మాన్‌గా, మరో వాచ్‌మన్ ఎక్స్‌రే విభాగంలో, ఒక లిఫ్ట్ ఆపరేటర్ వాటర్‌మాన్‌గా, ఒక ఓటీ అసిస్టెంట్ ఈసీజీ టెక్నీషియన్‌గా, ఒక ఎంఎన్ఓ ఎలక్ట్రిషియన్‌గా, ఒక స్ట్రెచర్ బేరర్, ముగ్గురు ఓటీ క్యామ్ టెక్నీషియన్‌లు ఎక్స్‌రే విభాగంలో పనిచేస్తున్నారు. ఆయా విభాగాల్లో వారి పనులు చేసేందుకు ఎవరూ లేక ఇబ్బందులు ఎదురవుతున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మరోవైపు స్ట్రెచ్చర్ బేరర్‌లు, వార్డుబాయ్‌లు లేక రోగుల సహాయకులే ఆ పనులు చేసుకుంటున్నారు. లిఫ్ట్ ఆపరేటర్లు లేకపోవడంతో లిఫ్ట్‌లు త్వరగా పాడవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఏ పోస్టు ఉద్యోగిని సంబంధిత పనులే చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

కర్నూలు (సిటీ): దేవనకొండ నుంచి ఆదోనికి ప్రతిరోజూ అప్ అండ్ డౌన్ బస్సు సౌకర్యం కల్పించాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కె.శాంతికుమార్ జిల్లా ప్రజా రవాణ అధికారి టి.శ్రీనివాసులును సోమవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శాంతికుమార్ మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో దేవనకొండ పెద్ద మండలం అని, ఈ మండల పరిధిలో 44 గ్రామాలు ఉన్నాయని, ఇక్కడినుంచి నిత్యం ఆదోని ప్రాంతానికి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని వివరించారు. ఇక్కడి నుంచి ఆదోనికి బస్సు లేకపోవడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్ఎంను కోరారు.

కర్నూలు (సిటీ): ఓర్వకల్లు మండలం బొడ్డువానిపల్లె గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బి.నాగరాజు, ఎంఆర్‌పీఎస్ ఓర్వకల్లు మండల విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బొగ్గుల మహేంద్ర బాబు సోమవారం ఆర్టీసీ-2 డిపో మేనేజర్ సుధారాణికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బొడ్డువానిపల్లె గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.